కథానిక:

# మమకారము

శ్రీ నెమలికంటి రామారావు

ఎప్పుడూ తిరుగుతూవుంటే ఎన్నెన్ని వింత అనుభవాలు, మధురసన్నివేశాలు, విషాదఘట్టాలు, అనుభూతిలోకి వస్తూవుంటాయి? తరువాత ఒకరోజున ఏమీ పనిలేని సమయంలో ఆ ఘట్టాలను స్మృతికి తెచ్చుకునేటప్పుడు మన హృదయంలో ఎంతెంత తుఫానులు లేస్తాయి? మనం రైలులో వెడుతున్నప్పుడు, బడలికతో నిద్రపోతుంటే, ఏరాత్రి వేళ ఎక్కడెక్కడేం జరిగిందో తెలియదు. తెల్లవారుతుండగా యింకా చెవులు, మనస్సు ఈ రైలుచక్రాల చప్పుడుతో సుళ్ళుతిరుగుతూంటే, నువ్వు కళ్ళు తెరిచేటప్పటికి ఎదుటి బల్లమీద నువ్వింతకు పూర్వం చూడని యువతి తన ప్రక్కను చుట్టుకుంటూ, చెదిరిపోయిన తన ముంగురులను సర్దుకుంటూ కన్పిస్తే, నీ హృదయం ఒక్కసారి గంతులు వేస్తుంది. ఆమె కూడ నీవంక ఫలానిభావంతో కూడిందని చెప్పలేకపోయినా,—చూస్తుంది. నీకు తెలియకుండానే నువ్వు ఆమెవంక తేపారచూస్తూ వుంటావు. నీకు తెలియకుండానే ఆ కాలమంతా ఆమెనుగురించే ఆలోచిస్తావు. ఎవరీమె! రైలు ఎక్కడ ఎక్కింది? ఎక్కడకు వెడుతోంది? నీకు తెలియకుండానే, ఎన్నెన్ని భావాలు ఆమెనుగురించి నీ మనస్సులో రైలుకుమల్లేనే పరుగెత్తుతాయి? ఆమె అందంగాను, ఆకర్షణీయంగాను వుంటుంది ఎంత అదృష్టవంతుడివి? ఆమె ఎదురుగా వున్నప్పుడు జీవిత మెంత మాధుర్యంగా వుంటుంది! ఎవరికి తెలుసు? బహుశః ఆ అజ్ఞాతసుందరి నీ భావాలకు, స్వప్నాలకు, నీ వాంఛలకు సరిగా సరిపోయినదై కూడ ఉండవచ్చును.

నువ్వీవిధంగా ఆలోచిస్తున్నపుడే, అకస్మాత్తుగా ఆమె ఏస్టేషనులోనో దిగిపోతున్నపుడు నీ హృదయంలో రేగే ఆవేదనకు అంతువుండదేమో! స్టేషనులో ఆమెకోసం ఎవరో ఎదురచూస్తూ ఉంటారు. ఆమె అతని చూచి, తన పెట్టె, బెడ్డింగు అందిస్తుంది స్టేషనుదాటి వారిద్దరూ జట్కా ఎక్కి బాగా దగ్గరగా కూర్చుంటారు. బండీ వడుతూవుండటం నీకు కనిపిస్తుంది.

ఇక ఆ సుందరి నీ కెప్పుడూ, ఎక్కడా కన్పించదు. ఒక రాత్రి అంతా నీ ఎదురుబల్లమీద గడిపిన ఆమె యిక వెళ్ళిపోయింది. ఆమె నింతకు పూర్వం నీ వెరుగవు. మాట్లాడలేదు. కాని ఆమె వెళ్ళిపోతుండగా నువ్వు కొంచెం విచారపడతావు. ఏమి టీ ప్రకృతి! మానవహృదయ మింత చపలమైనది. దౌర్బల్యమైనది ఎందువల్లనో! వెనుకకు తిరిగి ఆలోచించుకుంటే ఏమీ వుండదే!

నా కిటువంటి ప్రయాణానుభవాలు విషాదమైనవి వినోదమైనవి కూడ అప్పుడప్పుడు జ్ఞప్తికి వస్తూవుంటాయి.

కాలేజీకి సంక్రాంతిసెలవు లిచ్చారు. నేను కొండపల్లి చూచివద్దామని బయలుదేరాను. బెజవాడలో రైలు ఎక్కాను. నా కెదురుగా బల్లమీద ఒకమూల ఒక స్త్రీ కూర్చునివుంది. ఆమెను చూస్తూంటే యింకా చూడబుద్ధి అవుతోంది. ఆమెదుస్తులూ అవీ కులీనత ను తెలియబరుస్తున్నాయి. ఆ వయస్సులో ముఖం అంత ఆకర్షణీయంగా వుండటం చూచి నాకు ఆశ్చర్యం వేసింది. ఆమె రైలు కిటికీలోనుంచి అటువైపు చూస్తోంది. ఆమెకు దాదాపు అరవైసంవత్సరాలుంటాయి. బాగా భారీమనిషి. రైలు బయలుదేరింది. ఆమె యిటు చూచింది. ఆమెకన్నులు విచారాన్ని వెలిగ్రక్కుతున్నాయి. ఆమెముఖం, అంత అందంగా వున్నా, జీవితంలో ఏన్నో బాధలు అనుభవించినమాదిరి కన్పిస్తోంది. నాకు తెలియకుండానే నేను అమెవైపు చూడటం ప్రారంభించాను. నా మనస్సులో ప్రశ్నలు బయలుదేరాయి. "ఎవ రీమె? ఈమెజీవితం ఏరకమైంది? ఇంతవయస్సులో ఈమె ఎవరి సాయం లేకుండానే ఎక్కడకు వెడుతోంది?"

రైలు కొండపల్లి చేరింది. ఆమె కూడా లేచింది. నేను దిగివచ్చేసరికి ఆమె టికెట్ కలెక్టరుతో ఇంగ్లీషులో ఏదో మాట్లాడుతోంది. నేను చాల ఆశ్చర్యపడ్డాను. అప్పు డనకున్నాను— అందువల్లనే కాబోలు ఏకాంతంగా ప్రయాణం చెయ్యగలుగుతోంది - అని. కాని ఎందువలన ఆమెముఖాన విషాదచ్ఛాయ లంత గాఢంగా అలుముకుని వున్నాయి? ఆమె బహుశః ఈప్రదేశానికి చిరపరిచితురాలేమో! కాని ఆమె ఈ ప్రదేశానికి చెందినమనిషిమాత్రం కాదు. - నేను స్టేషను దాటి బయటకు వచ్చేటప్పటి కప్పడే ఆమె వెళ్ళిపోయింది. చాలా విసురుగా నడుస్తోంది. కొంచెంగా వంగిచేతిలో సంచి వూగుతూంటె, తల వంచుకొని వెడుతూండడం వెనుకనుంచి చూచినప్పుడు, ఎందుకనో గాని ఆమెకు ఒక్కసారి నమస్కరించా లనిపించింది. ఆమె చాలదూరంగా వెళ్ళిపోయింది.

రెండుగంటలతరువాత నేను ఖిల్లా ఎక్కుతున్నాను. సంక్రాంతిరోజుల్లో ఈ కొండలు ఎంతో సుందరంగా కనుపిస్తాయి! చెట్లన్నీ గుబురుగా వుండి, లోయంతా పచ్చగా కనుపిస్తూ వుంటుంది. ఎన్నిసార్లు చూచినా, ఆ ఖిల్లాను ఇంకా చూడాలని కోరిక కలుగుతుంది. నా మాదిరగా ఎంతమంది వచ్చి నేను నిలుచున్న స్థానంలోనే నిలబడి ఈ సుందరవాతావరణాన్ని చూస్తూ, పులకితశరీరాలతో ఆ ఖిల్లాకు సంబంధించిన చారిత్రాత్మకగాథలను ఎన్నిటిని స్మరించారో! ఏకాంతంగా అలా నిలబడి ఆ ప్రకృతిని చూస్తూంటే ఎందుకనో హృదయము విరాగమై, వేదాంతపు టాలోచనలతో నిండిపోతుంది? ఒకొక్కప్పుడు ఈ హృదయమే విషయవాంఛలతో నిండి పరవళ్లు తొక్కుతుంది. దీనికి కారణం వూహించడం సాధ్యమేనా? ఆ ఖిల్లానంతా చూడటం పూర్తిఅయేటప్పటికి ప్రొద్దుగ్రుంకపోతోంది. సూర్యుని అరుణకిరణాలు ఆ పచ్చని ప్రకృతిమీద పడి, అనేకరకమైన వింతసౌందర్యాన్ని కలిగిస్తున్నాయి ఏ చిత్రకారునకీ దృశ్యచిత్రణం సాధ్య మవుతుంది? ఏ కవికీ దృశ్యకథనం సాధ్య మవుతుంది? అది కేవలం అనుభవించవలసినదిమాత్ర మేనేమో!

నేను ఆ జీర్ణశిశిలాలను దాటి కొలనుదగ్గరకు వచ్చాను. మిగిలినచోట్లకన్నా యిక్కడ యింకా ఆ సాయంసంధ్యాశోభ అద్భుతంగా వుంది. చుట్టూ వున్న చెట్ల నీడలు ఆ కొలనులో ప్రతిఫలిస్తుంటే, సూర్యుని అరుణకిరణాలు వింతవింత రంగులను చూపిస్తూంటే, మంచుకన్నా చల్లగా వున్న ఆ కొలనునీరు మెల్లమెల్లగా కదులుతుంటే ఆహా! ఆ దృశ్యం వర్ణనాతీతం. నావెనుకవైపున పడిపోయిన గోడలు, విరిగిపోయిన దర్వాజాలు పాచిపట్టిన మెట్లు - అంతా ఒక మృత్యుదేవతాస్మృతి. నాఎదుట అంతా సజీవప్రకృతి. వాటి మధ్య ఏకాకిగా కదిలిపోతున్న హృదయంతో నేను ఆకస్మికంగా ఒక జీర్ణవృక్షచ్ఛాయలో ఆసీనయైన ఒక సజీవపదార్థాన్ని గమనించి వులిక్కిపడ్డాను. ఈ సమయంలో ఇక్కడ యిది సంభవమేనా? ఈ మానవలోకానికి సంబంధించినదా, లేక ఇంకేదైనానా? నేను భయోద్రేకంతోనూ, ఆశ్చర్యంతోనూ హృదయాన్ని చిక్కబట్టి అటువైపు చూచాను - ఆశ్చర్యం—! ఎవరినైతే నేను రైలులో కలుసుకున్నానో, ఆ వృద్ధవనితను అక్కడ చూచాను. ఇది సంభవమేనా? ఈమె యిక్కడి కెట్లావచ్చింది? ఎందుకు వచ్చింది? బాగా పరిశీలనగా చూచాను. ఆమె కన్నులనుండి అశ్రువు లేకధారగా పడుతుంటే, ఆమె తదేకదీక్షతో ఆ కొలనులోకి చూస్తోంది. ఆమె ఏదైనా పొగొట్టుకోలేదు కదా! అయినా ఆ కొలనులో పడిపోయిన వస్తువు తిరిగిరాదు కదా! ఎందుకు వ్యర్థంగా ఆమె అలా చూస్తుంది? చీకటిపడిపోతుంటే ఆమె తిరిగి వెళ్లదా? ఆమెకు భయం లేదా? నా మెదడులో ఆలోచనలు సుళ్లుతిరుగుతున్నాయి. నేను నెమ్మదిగా వెళ్ళిపోదామని వెనుకకు తిరగబోతూండగా ఆమె నన్ను పిలిచింది. తన స్థితి నేను చూచినందుకు ఆమె సిగ్గుపడ్డదేమో! నేను అప్పుడు ఆమె దగ్గరకు వెళ్లాలా? లేదా? అలాగే ఆమెవంక చూస్తూ ఆగిపోయాను.

"బాబూ! నే నిక్కడ ఏడుస్తూ కూర్చోటం నీకు ఆశ్చర్యంగా వుందికదూ!" అన్నదామె. నేను అవు నని తల వూపి, ధైర్యాన్ని చిక్కబట్టి ఆమె దగ్గరగా వెళ్ళాను. ఆమె ఆ కొలనులో తుల్లి దూసుకుని అడుగు మాపదలచినట్లుగా తీవ్రంగా చూస్తోంది. నే నేమీ మాట్లాడకుండా ఆమెదగ్గరగా నిలబడ్డాను, "నాయనా! నీకు మాతృహృదయక్షోభ అర్థమవుతుందా? ఈ కోలనన్నీ స్థితిలోనికి తీసుకువచ్చింది. నా ఏకైకపుత్రుడు ఈ కొలనులో జారి పడిపోయాడు." ఆమెకన్నులనుండి సంతతధారగా అశ్రువులు జారుతున్నాయి. ఆమెస్వరం గద్గదికమైంది.

అరె! ఈమె పిచ్చిదా? ఈమె ఒక్కతే రావడం నేను చూచానే! మరిప్పుడు కొడుకు దీంట్లో పడిపోయా డంటుం దేమిటి? నాకంతా అగమ్యగోచరంగా వుంది. "నాయనా! నువ్వు అర్థంచేసుకోగలవా, తల్లికి సంతాన మెంత అమూల్యమో?" అమె చీరెచెంగుతో కంటి నీళ్లను తుడిచింది. కాని వెంటనే ఆమెకళ్లు నిండిపోయాయి. నే నామెను ఓదార్చప్రయత్నించాను. ఆమెచేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను మౌనంగా.

నాయనా! నా క్షోభ ఎవరి కర్థమవుతుంది ఒకప్పుడు నే నెంతో హాయిగా వుండేదాన్ని. ఈరోజున నేను వ్యథితప్రాణిని. నా కొడుకు వానికి నా హృదయం అర్థంకాదు. నవమాసాలు నేను వాడిని మోసినప్పుడు నా హృదయ మెంత పులకితమయ్యేదో వాడి కెలా తెలుస్తుంది? తరువాత - నా హృదయానికి వానిని గట్టిగా అదుముకునివుండి వాడు బోసినోటితో పకపకలాడుతుంటే ఇప్పటిమాదిరే నా కళ్ళు అశ్రువులతో నిండిపోయేవి. కాని వాటికీ, ఇప్పటివాటికీ సంబంధమేమన్నా వున్నదా? నాయనా! నేను కూడా ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నదానినే. కాని ప్రేమువిషయంలో ఈ విద్య, విజ్ఞానం ఎందుకు పనికివస్తుంది? నేను కేవలం తల్లినిమాత్రమే! ఎన్నిరాత్రిళ్లు నేను నిద్రలేకుండా వాడివంక చూస్తూ గడిపానో నీ కే మర్థమవుతుంది? నేను కేవలం పిచ్చిదాన్నయాను. అతడికి సరిగా పది సంవత్సరాలు నిండాయో లేదో, చదువుకోసం బోర్డింగుస్కూలుకు పంపేశాడు నా భర్త... అయిపోయింది...నానుంచి అతడు చిరస్థాయిగా మూరమైపోయాడు ఎప్పుడో సంవత్సరానికి నాల్గుసార్లుమాత్రం వచ్చేవాడు. వచ్చిన ప్రతిసారి వాడిలో కలిగే మార్పులు చూచి నేను ఆశ్చర్యపడిపోయేదాన్ని. వాడు పెద్దవాడు అయ్యాడు. ప్రతిసారికి వాడి శరీరం, స్వరం, నవ్వు మారిపోయేవి. నా హృదయానికి అదుముకునే ఆ శిశువు యిప్పు డేడీ?

ఆకస్మికంగా నా భర్త పోయాడు. నేను ఏకాకిగా వుండలేకపోయాను. నేను నా కొడుకు దగ్గరే వుందా మనుకున్నాను. కాని మృత్యువు ఏ గృహంలో ప్రవేశిస్తుందో, ఆ యింటోకి చాలకాలంవరకు మళ్లీ రాకుండా తన పనంతా పూర్తిచేసుకుని మరీ పోతుంది. ఆ సంవత్సరం నేను సెలవల్లో వాడికి పెళ్లిచేద్దా మనుకున్నాను. కోడలు నా యింట్లో లక్ష్మిమాదిరి తిరుగుతుందని మురిశాను...కాని...నేను దురదృష్టవంతురాలను ..ఒకరోజున నా కొడుకు స్నేహితులతో కలిసి ఖిల్లా చూస్తానంటూ వెళ్లాడు. అంతే! - మళ్లీ వాడు నాకు కనపడలేదు. ఆమె ఒక్కసారి గావురుమని ఏడ్చింది - ఇంకా నా కెవరు?...వాడి స్నేహితులు వచ్చి నా-కొ-డు-కు ఆ కొలనులో-ప-డి-పోయా డని చెప్పారు. అయినా - నా ప్రాణాలు ఎలా నిలిచాయో నాకే ఆశ్చర్యంగా వుంది. నేను యిక్కడికి వచ్చి చూచాను... ఏ ముంది? ఈ నీరు ఈవిధంగానే నిర్మలంగా, ప్రశాంతంగా వుంది నాకు - ఏమీ లేదు. ఈ ప్రపంచమంతా శూన్యం. ఆ-రోజునుంచి నేను దేశమంతా తిరుగుతున్నాను. ఇది ఏడో సంవత్సరం. సరిగా ఈరోజుకు ఇక్కడకు రావడం మాత్రమే నాకు... శాంతి!..." ఆమె కనుకొలకుల్లోంచి అశ్రువులు జలజల రాలుతున్నాయి.

పూర్ణిమచంద్రుడు ఆ కొండల్లో ఎక్కడినుంచో బయటపడ్డాడు. ఈమెవిషాదగాథ ఆ మధురప్రశాంతవాతావరణాన్ని ఎంతగా మార్చివేసింది! నా హృదయంలో సూదిమొనతో గ్రుచ్చుతున్నట్లుగా వుంది. ఆమె ఆరాత్రంతా ఆకొలనువద్ద ఆచెట్టుక్రింద గడుపుతుంది. ఆ శూన్యహృదయంలో, భయానికి తా వెక్కడిది? మళ్లీ ఆమె అలాగా ఆ కొలనులోకి చూస్తోంది. ఈమెఈతపస్సు ప్రయోజనశూన్యమేగదా! ఆ మాతృహృదయ మెంత లోతైనది; నేను నెమ్మదిగా లేచి బయలుదేరాను. ఆ శిథిలకుడ్యాలు దాటుతూ వెనుకకు తిరిగి చూచాను.

ఆ గాఢనీరవప్రశాంతప్రకృతిలో ఈ వృద్ధవనిత అలాగే పాషాణమూర్తిలా కొలనులోకి చూస్తూ ఆచెట్టుక్రింద కూర్చునివుంది...!



ఆంధ్రపత్రికాకార్యాలయమున జరిగిన వినాయక నవరాత్ర్యుత్సవ సందర్భమున తీసిన చిత్రము. ఈ ఉత్సవము 83 ఏండ్లుగా జరుపబడుచున్నది.